క్లుప్తంగా

‘డబుల్’లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

తుక్కుగూడ: మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ముందుగా స్థానికులకు కేటాయించాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రావిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని చాలా గ్రామాల్లో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని తెలిపారు. ఇక్కడి భూముల ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు సొంతింటి కలను నెరవేర్చుకోలేపోతున్నారని పేర్కొన్నారు. ఇళ్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాతే మిగిలిన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వాటాతో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించేందుకు వెళ్లిన తమ పార్టీ నేతలను అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



పూజలందుకున్న నల్లపోచమ్మ తల్లి

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామంలో శుక్రవారం నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వైభవంగా నిర్వహించారు. యంజాల శ్రీధర్ కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో రెండు రోజులుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, విగ్రహ స్నపనం, హోమాలు నిర్వహించారు. పూజారి భానుప్రకాశ్ శర్మ పర్యవేక్షణలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు లక్ష్మీనారాయణ హోమం, గర్తవ్యాసం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, దృత్ దిక్ బలి, పూర్ణాహుతి, పండిత సన్మానం, అనంతరం బోనాల సమర్పణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారికి పూజలు చేశారు.

డబుల్ హామీ అమలులో ప్రభుత్వం విఫలం



కప్పాటి పాండురంగారెడ్డి

కందుకూరు: నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పంపిణీ చేస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నూతన సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించుకున్న బీఆర్‌ఎస్ పాలకులు.. పేదల గూళ్లకు మాత్రం నిధులు ఇవ్వకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. నిర్మించిన అరకొర ఇళ్లను కూడా పేదలకు అందజేయడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో నిర్మించిన ఇళ్లను ఇక్కడికిక్కడే పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇతరులకు ఇస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

గుర్రంగూడ అభివృద్ధికి వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడను అభివృద్ధి స్థానిక కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్ శుక్రవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గుర్రంగూడలోని ఎక్కంకుంట చెరువు సుందరీకరణ కోసం రూ.50 లక్షలు మంజూరు చేయాలని కోరామన్నారు. అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వరకు రోడ్డు పనులకు గాను ఇప్పటికే రూ.3 కోట్లు కేటాయించారని తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన పనులను పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మహేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబీమా పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. 2023- 24 సంవత్సరంలో కొత్త పట్టా పాసు బుక్ వచ్చిన రైతులు, ఇంతకు ముందు దరఖాస్తు చేసుకోని వారందరూ వెంటనే అప్లయ్ చేసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, బీమా ఫారంతో వచ్చి స్థానిక రైతు వేదికలో అందజేయాలని సూచించారు.

నాడీ పట్టే నాథుడేడి?



బడంగ్‌పేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

- బడంగ్‌పేట్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యం కరువు
- డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీ
- ఆశ వర్కర్‌తోనే కొనసాగుతున్న దవాఖానా
- ఆందోళనలో స్థానికులు, రోగులు

బడంగ్‌పేట్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందంగా మారింది బడంగ్‌పేట్ యూపీహెచ్‌సీ పరిస్థితి. ఆస్పత్రి భవనం, అన్ని వసతులు అందుబాటులో ఉన్నా వైద్యుడు, సిబ్బందిని కేటాయించకపోవడంతో స్థానిక ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగానే మారింది. కార్పొరేషన్ల ఆదాయంలో బడంగ్‌పేట్‌ది రాష్ట్రంలోనే రెండో స్థానం. మెరుగైన శానిటేషన్ విభాగంలో దేశంలోనే నాలుగో స్థానం. ఈ మేరకు కార్పొరేషన్‌కు అవార్డులు కూడా దక్కాయి. 3.6 లక్షల జనాభా, లక్ష మందికిపైగా ఓటర్లు, వందల కోట్లతో అభివృద్ధి.. కానీ ఇక్కడి ప్రజలకు జబ్బు చేస్తే మందు బిళ్ల ఇచ్చే నాథుడు లేడు. నాడీ పట్టి చూసే డాక్టర్ ఎక్కడా కనిపించడు. అప్పుడప్పుడు ఆశ వర్కర్ వచ్చి.. జ్వరం, జలుబుకు అవసరమైన మాత్రలు అందజేస్తుంది.

కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

ఏడాదిన్నర క్రితం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బడంగ్‌పేట్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సమయంలో స్థానికులందరూ చాలా సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రాంతానికి యూపీహెచ్‌సీ రావడంతో వీరి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కానీ కొద్ది రోజులు కూడా గడవక ముందే వీరి ఆశలు గల్లంతయ్యాయి. నిత్యం ఉదయం పది గంటలకు ఒక ఆశ వర్కర్ వచ్చి దవాఖానాను తెరుస్తుంది. అటెండర్ పనులు సైతం ఆమే చేస్తుంది. వచ్చిన పేషెంట్లకు తోచిన మందులు ఇస్తుంది. గర్భిణులు వస్తే డాక్టర్ లేరని చెబుతుంది. సాయంత్రం అవగానే తాళం వేసుకుని వెళ్లిపోతుంది. ఇదీ ఇక్కడ జరిగే రోజూవారీ కథ..

ఉన్న వైద్యుడినీ పంపించేశారు..!

నెల రోజుల క్రితం ఇక్కడ ఓ వైద్యుడిని అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ కొద్ది రోజులకే ఆయన రావడం మానేశాడు. బడంగ్‌పేట యూపీహెచ్‌సీ కింద బడంగ్‌పేటలోని వందలాది కాలనీలతో పాటు నాదర్‌గుల్, గాంధీ నగర్, కుర్మల్‌గూడ, ఇలా 20 డివిజన్లనుంచి సుమారు 40 మందికిపైగా గర్భిణులు, 150 నుంచి 200 మందికి పైగా ఔట్ పేషెంట్లు ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యుడిని నెల రోజుల క్రితం లెనిన్‌నగర్ సబ్ సెంటర్‌కు మార్చారు. దీంతో స్థానిక ఆస్పత్రి.. దేవుడు లేని గుడిగా మారిందని రోగులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా అల్మాస్‌గూడకు బస్తీ దవాఖానా మంజూరైంది. ఆస్పత్రి నిర్మాణం పూర్తి కాలేదు. కానీ ఓ డాక్టర్, స్టాఫ్ నర్సును కేటాయించారు. ఆస్పత్రితో పాటు అన్ని వసతులు ఉన్న చోట వైద్యుడిని కేటాయించడం లేదు. ఉన్నతాధికారులు అనుసరిస్తున్న ఈ పద్ధతిపై కార్పొరేషన్ ప్రజలు మండిపడుతున్నారు. అవసరం లేని చోట్ల సిబ్బందిని కేటాయించడం ఏమిటని..? నిలదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, బడంగ్‌పేట పాలక వర్గం మేల్కొని రోగులు, గర్భిణుల వైద్య సమస్యలను తీర్చాలని కోరుతున్నారు. డాక్టర్‌తో పాటు స్టాఫ్ నర్సులు,ఏఎన్‌ఎం, ఇతర సిబ్బందిని కేటాయించి ప్రజలకు సకాలంలో వైద్యం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రేపు టీడీపీ కార్యాలయం ప్రారంభం

- మందమల్లమ్మ చౌరస్తా నుంచి ర్యాలీ
- హాజరు కానున్న రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్
- కార్పొరేటర్ మల్లేశ్‌ముదిరాజ్ వెల్లడి

మీర్‌పేట: టీడీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు త్వరలో నియోజకవర్గంలో ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు, మీర్‌పేట కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ కంభంపాటి రామ్మోహన్‌రావు తదితరులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా మందమల్లమ్మ చౌరస్తా నుంచి జిల్లెలగూడ, మీర్‌పేట మీదుగా ర్యాలీ నిర్వహించనున్నట్లు స్పష్టంచేశారు. భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందని, బహుజనుల తెలంగాణ రాలేదని, 2014 ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీకి 22 శాతం ఓట్లు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. పార్టీ ప్రారంభోత్సవం, పాదయాత్రను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంటు బీసీసెల్ అధ్యక్షులు కొమరేష్, నాయకులు ముత్యాల వాసు సాగర్, శ్రీశైలం, ఆసిఫ్, మల్లేశ్, రామునాయక్, బాలరాజు, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మల్లేశ్ ముదిరాజ్

రేపు జల్‌పల్లిలో బోనాలు



పోచమ్మ ఆలయం వద్ద పెయింటింగ్ వేయిస్తున్న కౌన్సిలర్ యాదగిరి

- ముస్తాబవుతున్న అమ్మవార్ల ఆలయాలు
- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని దేవాలయాలు బోనాల పండగకు ముస్తాబవుతున్నాయి. ఆదివారం బోనాలను పురస్కరించుకొని గ్రామంలోని రెండు పోచమ్మ దేవాలయాలు, మల్లన్న దేవాలయాల వద్ద మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. 16వ వార్డు కౌన్సిలర్ బుడుమాల యాదగిరి శుక్రవారం ఆలయాలకు రంగులు వేయించారు. ఆదివారం నిర్వహించే వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సోమవారం తొట్టెల, పోతరాజులు ఊరేగింపు ఉంటుందని స్పష్టంచేశారు. నగరంలో ఆషాఢ మాసం బోనాల అనంతరం జల్‌పల్లిలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. గ్రామస్తులందరూ ప్రశాంత వాతావరణంలో పండుగలు చేసుకోవాలని కోరారు.

తీరనున్న ‘వీధి’ సమస్యలు

- ప్రారంభానికి సిద్ధమవుతున్న వీధి వ్యాపారుల మార్కెట్ సముదాయం
- రూ.50 లక్షల వ్యయంతో తుది దశకు చేరుకున్న పనులు
- 48 మందికి శాశ్వత షెడ్లు అందజేయనున్న అధికారులు



మంత్రాల చెరువు వద్ద ముస్తాబవుతున్న వీధి వ్యాపారుల సముదాయం

మీర్‌పేట: మంత్రాల చెరువు వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడంతో పాటు వీధి వ్యాపారస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో షెల్టర్ నిర్మించి, వ్యాపారులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు వద్ద నిర్మిస్తున్న ఈ మార్కెట్ సముదాయాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మీర్‌పేట, బాలాపూర్ చౌరస్తాతో పాటు బడంగ్‌పేట, పరిసర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలోని వీధి వ్యాపారస్తులకు వీటిని అందజేయనున్నారు. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తయ్యాయి. యార్డులో మొత్తం 48 మందికి స్టాళ్లను కేటాయిస్తారు. ఇది పూర్తయితే చిరువ్యాపారులు రోడ్లపై రాకుండా ఉంటుంది.

వారంలో ప్రారంభిస్తాం...

వీధి వ్యాపారుల మార్కెట్ సముదాయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్లాస్టింగ్ మినహా మిగిలిన వర్క్ పూర్తయింది. వారం రోజుల్లో యార్డును ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– గోపీనాథ్, డీఈ మీర్‌పేట్ కార్పొరేషన్

మెహబ్బత్‌నగర్‌కు బీటీ రోడ్డు

మహేశ్వరం: మెహబ్బత్‌నగర్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మంత్రి సబితారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆమెను కలిశారు. మెహబ్బత్‌నగర్ గేటు(శ్రీశైలం జాతీయ రహదారి) నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామాలు, గిరిజన తండాలు, అనుబంధ గ్రామాలను కలిపేందుకు బీటీ రోడ్లు, లింకు రోడ్లు పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని తెలిపారు. తుమ్మలూరు గేటు– మహేశ్వరం మండల కేంద్రం వయా

- త్వరలోనే నిధులు మంజూరవుతాయి
- మంత్రి సబితారెడ్డి వెల్లడి

తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.14.20 కోట్ల నిధులు మంజూరు చేశామని, పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. మెహబ్బత్‌నగర్ గేటు నుంచి గ్రామం వరకు అవసరమైన బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే నిధులు మంజూరవుతాయని స్పష్టంచేశారు. అంతకు ముందు గ్రామంలో నెలకొన్న సమస్యలు, అవసరమైన నిధు



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

లపై ఆరా తీశారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నల్లవోలు శ్రీకాంత్‌రెడ్డి, హర్షద్, వేణునాయక్, పాండు నాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘శివగంగ’లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ చేశారు. మహాశివుడికి పూలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం కావడంతో ఉదయం నుంచే మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి

‘డ్రైవర్ డిక్లరేషన్’కు జేఏసీ మద్దతు



పోస్టర్‌ను అవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఎల్‌బీనగర్: కామ్‌గర్ కర్మచార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నాంపల్లి గాంధీ భవన్ సమీపంలోని ప్రకాష్ హాల్‌లో నిర్వహించనున్న డ్రైవర్ డిక్లరేషన్ సభకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ రవాణా రంగ కార్మిక ఐక్య సమితి నాయకులు తెలిపారు. మద్దతుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని సమితి కార్యాలయంలో అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణా కార్మికుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉంచేందుకు అంగీకరించినందున సభకు మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐక్య సమితి కన్వీనర్ దాయానంద్, కో కన్వీనర్‌లు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రుద్రక్ష , మల్లేష్, సంపత్‌రెడ్డి , క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు రవి, సభ్యులు రాంపల్లి మల్లేష్, ఉప్పల్ శివ, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎండీ ముక్తర్, సభ్యులు మల్లిఖార్జున్, పాండు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. వర్షాల కారనంగా డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో వరదనీరు రోడ్డుపై నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మాన్‌సూన్ బృందాలతో కలిసి అక్కడికి వెళ్లి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. హయత్‌నగర్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కుమార్‌తో కలిసి డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. వరదనీరు నిలిచే ప్రాంతాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వరదనీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని డీసీని కోరారు.

వాన పాట్లు!

అంతర్గత రోడ్లు గుంతలమయం

- ప్రధాన మార్గాల్లో నిలిచిన వర్షం నీరు
- రాకపోకలకు తప్పని అవస్థలు
- పలుచోట్ల కూలిన ఇళ్లు



ఓంఎస్ స్కూల్ బస్టాప్ వద్ద నిలిచిన వరద నీరు

పహాడీషరీఫ్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాదే ముస్తఫా బస్తీలో విద్యుత్ స్తంభాలకు స్పార్క్ రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శ్రీరాం కాలనీలోని ఎగువ కాలనీల నుంచి వచ్చిన నీరు వెళ్లేందుకు అవుట్ లెట్ వ్యవస్థ లేకపోవడంతో దిగువ బస్తీల ప్రజలు వరద నీటితో ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు మ్యాన్ హోళ్లను తెరిచి వర్షం నీటిని నాలాల్లోకి పంపిస్తున్నారు.

కూలిన ఇల్లు

వరుస వర్షాల నేపథ్యంలో మామిడిపల్లిలోని ఓ రేకుల ఇల్లు కూలిపోయింది. గ్రామంలోని నగేష్ హోటల్ గల్లీలో ఉన్న ఈరంకి రాములుగౌడ్‌కు సంబంధించిన 6–26 నంబర్ కలిగిన పురాతన ఇల్లు శుక్రవారం మధ్యాహ్నం కూలింది. ఆ సమయంలో ఇంట్లో, గోడ అవతలి వైపు ఎవరూ లేకపోవడంతో పాటు పెను ప్రమాదం తప్పింది.

మహేశ్వరంలో 97.0 మిల్లీమీటర్ల వర్షపాతం

మహేశ్వరం: మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న ముసురుతో పంటలు జీవం పోసుకున్నాయి. శుక్రవారం మహేశ్వరం గ్రామంలో 97.0 మిల్లీమీటర్లు, మండలంలో 86.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల ఏఎస్‌ఓ విజయ తెలిపారు.వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పహాడీలో గుంతలమయమైన బీటీ రోడ్డు



మామిడిపల్లిలో వర్షాలకు కూలిన ఇల్లు